

నేడు సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించనున్నారు. సర్వమానవాళి శ్రేయస్సు కోసం ఈ కార్యక్రమం జరుగుతుంది.



వేణుగోపాలుని సేవలో తెలంగాణ మంత్రి

గంపలగూడెం: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామిని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు.

నేటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు



మంగళగిరి: పానకాల లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమై మార్చి 7వ తేదీ వరకు జరుగనున్నాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ హనుమంతరావు నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

న్యూస్‌రీల్

28న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 28 తేదీ జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఉపాధి అధికారి డాక్టర్ పీవీ రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బైజూస్, ఇన్నోవా సోర్స్, అపోలో, జోస్ అలూకాస్, టెక్నోటాక్స్ సొల్యూషన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని వివిధ విభాగాల్లో 370 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఫార్మసీ, బీటెక్ విద్యార్హతలు ఉన్న వారు ఈ మేళాలో పాల్గొనాలని కోరారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు 28 తేదీ ఉదయం పది గంటల్లోగా ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్, ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్లలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 80087 42842 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శనివారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. మాచవరానికి చెందిన ఎలిసల శ్రీనివాసరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసి రూ. 1,00,001 విరాళాన్ని అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలు అందచేశారు.

వైద్య పరికరాల కొనుగోలు, వసతుల కల్పనకు నిధులు



మచిలీపట్నంటౌన్: పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ మంజూరు చేసిన రూ. 5.07 కోట్లతో బందరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధి మండలాల్లో వైద్య పరికరాల కొనుగోలు, ఆసుపత్రుల్లో వసతులు కల్పించనున్నామని ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ సబార్డినేట్ కమిటీ చైర్మన్ హోదాలో దేశంలోనే అతి పెద్ద పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నిధుల నుంచి వైద్యసేవల మెరుగు కోసం సాయం కోరామని పేర్కొన్నారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ, చల్లపల్లి, గూడూరులో ఉన్న సీహెచ్‌సీలలో, గుడివాడ ఏరియా ఆసుపత్రిలో, 522 గ్రామాలకు సంబంధించిన 21 పీహెచ్‌సీల్లో మౌలిక వసతుల కల్పనకు మొదటి విడతగా ఈ నిధులను కేటాయించారన్నారు. ఈ ఆసుపత్రులలో బ్లడ్ ఆటో ఎనలైజర్స్, బ్లడ్ స్టోరేజీ రిఫ్రిజిరేటర్లు, 12 చానల్ ఆటోమెటిక్ ఈసీజీ మిషన్లు, మొబైల్ ఎక్స్‌రే యూనిట్లు, ఆక్సిజన్ సిలిండర్లు, పల్స్ ఆక్సీమీటర్లు, సీపీపీ మానిటరింగ్ తదితర 32 రకాల వైద్య పరికరాలను రూ. 44 లక్షలతో కొనుగోలు చేస్తామని వెల్లడించారు. అవనిగడ్డ, చల్లపల్లి, గూడూరు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో మౌలిక సదుపాయాల కోసం రూ. 14 లక్షలు ఖర్చు చేస్తామని వివరించారు. చిన్నాపురం, చేవెంద్రపాలెం, పెడన, బంటుమిల్లి, పెదతుమ్మిడి, రామాపురం, రుద్రపాక, గుడ్లవల్లేరు, కౌతరం, మోటూరు, పామర్రు, వెంట్రప్రగడ, పెదపారుపూడి, వెలమర్రు, నిమ్మకూరు, కనుమూరు, జమిగొల్వేపల్లి, వీరంకిలాకు, కపిలేశ్వరపురం, చినఓగిరాల, కాటూరు ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులు, పిల్లల వైద్యసహాయం కోసం 13 రకాల వైద్యపరికరాలు, ల్యాబరేటరీలకు సంబంధించి ఐదు పరికరాలు కొనుగోలుకు రూ. 14 లక్షలు వెచ్చించామన్నారు. అవనిగడ్డ, గుడివాడ ఏరియా ఆసుపత్రిలో అల్ట్రా సౌండ్ మిషన్‌లను రూ. 50 లక్షల వ్యయంతో కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వీటిని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

బీసీలంటే చిన్నచూపు కాబట్టే...

- అర్జునుడు ఆస్పత్రిలో ఉంటే ఎవరైనా అలా చేస్తారా?
- మీ దన్ను చూసుకునేగా అలా రెచ్చిపోతోంది
- క్యాడర్, క్యారక్టర్ ఏవీ పట్టించుకోరా?
- బూతులు మాట్లాడితేనే పదవులిచ్చేస్తారా?
- పార్టీ ఆఫీసులపై దాడులు ఎవరివల్ల జరిగాయో ఆలోచించండి
- బాబు వద్ద పట్టాభి తీరుపై టీడీపీ సీనియర్ల గుర్రు
- నష్ట నివారణకే గన్నవరం తక్షణ కమిటీ



'బీసీలు అంటే వెన్నెముక. వెనుకబడిన వర్గాల వారు కాదు' అని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పదే పదే చెబుతున్నారు. ఆ వర్గాలను అదే స్థాయిలో చూస్తున్నారు. పదవుల అంశంలో అంతే ప్రాధాన్యమిస్తున్నారు. బీసీలకు మంచి చేయడంలో వైఎస్సార్ సీపీ అధినేతకు యావత్ భారతదేశంలో మంచి గుర్తింపు వచ్చింది. ఆదరణ లభిస్తోంది.

'మరి మన పార్టీలో ఏం జరిగింది. ఇప్పుడేం జరుగుతోంది. బీసీలు అన్నింటినీ బేరీజు వేసుకుంటున్నారు. మాటలతో మనం ఇంకెంత కాలం మభ్యపెట్టగలం' అని టీడీపీ అధినేత చంద్రబాబు వద్ద ఆ పార్టీకి చెందిన సీనియర్లు వాపోయారు. గన్నవరంలో చోటుచేసుకున్న తాజా పరిణామాల నేపథ్యంలో బీసీ వర్గాల ముఖ్యనేతల అంతర్గత చర్చల్లో వచ్చిన అంశాలు అధినేత చెవికి చేరాయి. దీనిపై తీవ్రంగా కలత చెందిన చంద్రబాబు తక్షణ నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించారు.

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: 'గన్నవరం నియోజకవర్గ ఇంచార్జి బచ్చుల అర్జునుడు తీవ్ర అస్వస్థతలో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా తగుదునమ్మా అంటూ నేను వస్తున్నా. నేనే పోటీచేస్తా అంటూ పట్టాభిరాం అక్కడకు ఎలా వెళతారు. అర్జునుడు బీసీ వర్గానికి చెందినందునే అంత ధీమాగా, బహిరంగంగా ఆయన చాలెంజ్ చేయగలిగారు. అదే పార్టీలో బలమైన సామాజికవర్గానికి చెందిన వారు అక్కడ ఇంచార్జిగా ఉన్నట్లయితే ఆ మాట అనగలిగే వారా? సామాజికవర్గం అండ చూసుకునే రెచ్చిపోయారు. మీ దన్ను అంతలా ఉండబట్టే పట్టాభి ఆ స్థాయిలో రెచ్చిపోతున్నారనేది పార్టీలో మెజార్టీ అభిప్రాయం' అని టీడీపీ సీనియర్లు అనడంతో చంద్రబాబు కంగుతిన్నారనేది సమాచారం. 'క్యాడర్, క్యారక్టర్ ఏవీ పట్టించుకోకుండా ఇష్టానుసారం బూతులు మాట్లాడిన వారికి పదవులు ఇచ్చేస్తారనేది ముఖ్య శ్రేణులు భావిస్తున్నాయి. మంగళగిరి, గన్నవరం పార్టీ ఆఫీసులపై దాడులు ఎవరివల్ల జరిగాయి? ఎందువల్ల జరిగాయో మీరే విశ్లేషించుకోండి' అని పార్టీ నాయకులు అనడంతో బాబు ఆలోచనల్లో పడ్డారని తెలిసింది. అయినా కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనకళ్ల నారాయణ, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తదితర బీసీ వర్గానికి చెందిన నాయకులు ఉన్నారు. గన్నవరంలో పార్టీకి ఏదైనా సమస్య ఉందని భావిస్తే అర్జునుడు తీవ్ర అస్వస్థతో ఉన్నందున కొనకళ్ల, కొల్లు, లేదా బచ్చుల కుమారుడు, మరెవరినైనా సీనియర్లను అక్కడకు పంపి ఉండవచ్చు. కానీ పట్టాభిని పంపి రెచ్చగొట్టించడాన్ని బట్టి బీసీలంటే మీకు చిన్నచూపు ఉందనే భావన ప్రజల్లోకి, పార్టీ క్యాడర్‌లోకి బాగా వెళ్లిపోయిందని వివరించడంతో బాబు కంగుతిన్నారని సీనియర్ నాయకుడు 'సాక్షి'కి తెలిపారు. బీసీల గురించి చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన ఎంతమేరకు ఉందనేది బేరీజు వేసుకుంటున్నారని కూడా అన్నారనేది సమాచారం.

మాటలు చెపితే సరిపోదు...

'ఎమ్మెల్సీల్లో బీసీలకు జగన్ ఇచ్చిన ప్రాధాన్యతపై మా వెనుకబడిన వర్గాల్లో బాగా చర్చ జరుగుతోంది. అంతకుముందు కూడా వివిధ పదవుల్లో దక్కిన ప్రాధాన్యతను ఇప్పటికే గుర్తించారు. ఇక నుంచి మీకు మేమంత చేశాం.. ఇంత చేసేశాం.. అని టీడీపీ చెపితే వినే దశలో బీసీ వర్గాలు లేవు. అన్నీ విశ్లేషించుకుంటున్నాయి. గణాంకాలతో సహా ముఖ్యులకే పాఠాలు అప్పజెపుతాయి' అని విజయవాడకు చెందిన బీసీ ముఖ్య నాయకుడు ఒకరు కుండబద్దలు కొట్టారు.

గన్నవర్గానికి కో- ఆర్డినేటర్ కమిటీ

చంద్రబాబు ఆదేశాల మేరకు గన్నవరం నియోజకవర్గానికి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శుక్రవారం కమిటీని నియమించారు. కమిటీ కో–ఆర్డినేటర్‌గా కొనకళ్ల నారాయణ, సభ్యులుగా బచ్చుల అర్జునుడు కుమారుడు బచ్చుల సుబ్రహ్మణ్యంతోపాటు మరో నలుగురికి చోటు కల్పించారు.



సీఐ తలకు అయిన గాయం

సీఐ కనకారావుపై చేసిన దాడిని పోలీసువర్గాలు తీవ్రంగా భావిస్తున్నాయని. టీడీపీ అల్లరిమూకలు ఇంతలా బరితెగిస్తాయని అనుకోలేదని వారంటున్నారని చంద్రబాబు దృష్టికి పలువురు తీసుకెళ్లారు. సంఘటన జరిగినప్పుడు గాయం తీవ్రత బాగా తెలిసిందని, ఏడు కుట్లు పడ్డాయని వివరించారు.

చిన్న తిరునాళ్లకు పక్కాగా ఏర్పాట్లు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల విజయవంతానికి అందరూ సమన్వయంగా వ్యవహరించి పక్కాగా ఏర్పాట్లుచేయాలని నందిగామ ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. మార్చి 7 నుంచి 11 వరకు ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించి శనివారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. మార్చి 9 న పుట్టింటి పసుపు–కుంకుమ బండ్లకు విద్యుత్ దీప కాంతులు ఏర్పాటు చేసే సందర్భంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఆలయం వద్ద పలు శాఖల సమాచార కేంద్రాలతో పాటు, తాగునీటి సౌకర్యం, తాత్కాలికంగా బస్టాండ్‌ల ఏర్పాటు ఉంటుందన్నారు. తిరునాళ్లకు ముందు రోజు కల్లా అన్ని శాఖల అధికారులు వారి యాక్షన్ ప్లాన్‌తో పాటు, ఫోన్ నెంబర్లను ఆలయ అధికారులకు, రెవిన్యూ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఆలయ ఈఓ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మునేటిలో భక్తులకు జల్లు స్నానాల ఏర్పాటు చేశామని వెల్లడించారు. అలానే మునేరులో తాత్కాలిక కేశఖండనశాల ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం తిరునాళ్ల ఉత్సవాల పోస్టర్‌ను అధికారులు, పాలకవర్గ సభ్యులు ఆవిష్కరించారు. తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్పీ ప్రసాద్, ఆలయ ఈఈ వైకుంఠరావు, వైద్యాధికారి సుజన, విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు, ఎస్ఐ హరిప్రసాద్, జగ్గయ్యపేట ఆర్టీసీ డీఎం ప్రసాద్, గ్రామ కార్యదర్శి శ్యామ్, పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని అమ్మవారి ఆలయ ప్రాంగణ కళావేదికపై వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఉత్సవమూర్తులకు శనివారం ఆలయ అర్చకులు వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బుద్దా రాంబాబు, చింకా శ్రీనివాస్, బచ్చు మాధవికృష్ణతో పాటు పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవం వీక్షించిన భక్తుల ఇంట సకల శుభాలు కలుగుతాయని, సంతాన యోగం, వివాహాలు కాని వారికి వివాహాలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

సంక్షేమ పథకాలతోనే సమగ్రాభివృద్ధి



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు కైలే, సింహాద్రి, ప్రతాప్ అప్పారావు



మాట్లాడుతున్న హారిక చిత్రంలో సీఈవో శ్రీనివాసరావు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు ఢిల్లీరావు, రంజిత్‌బాషా, విప్ ఉదయభాను

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందడంతోనే సమగ్రాభివృద్ధి జరుగుతోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తెలిపారు. జెడ్పీ సర్వసభ్య సమావేశం స్థానిక కన్వెన్షన్ హాల్లో హారిక అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమం, సాధికారత, విద్య తదితర రంగాల అభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట వేసి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి అంటే భవనాలు, రోడ్లు వేయటమే కాదని కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చడం కూడా అని పేర్కొన్నారు. గత ఏడాది నవంబర్ 4న జరిగిన సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ హారిక దృష్టికి సభ్యులు తీసుకొచ్చిన పలు అంశాలపై జిల్లా అధికారులు తీసుకున్న చర్యల వివరాలను జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు సభకు వివరించారు. విద్యాశాఖపై జరిగిన చర్చలో కృత్తివెన్ను, పెనుగంచిప్రోలు, గంపలగూడెం, జి.కొండూరు, కోడూరు, తిరువూరు, గన్నవరం, ముసునూరు, ఎ.కొండూరు, మైలవరం, విజయవాడరూరల్, పెనుగంచిప్రోలు, కైకలూరు, బాపులపాడు, తోట్లవల్లూరు మండలాల జెడ్పీటీసీలు మాట్లాడుతూ నాడు – నేడు తరగతి గదుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు పి.రంజిత్‌బాషా, ఢిల్లీరావు, డీఈవోలు స్పందించి పనులు వేగవంతం చేయిస్తామన్నారు. గన్నవరం, కృత్తివెన్ను, ఎ.కొండూరు, పెనుగంచిప్రోలు, పెడన, నూజివీడు, అవనిగడ్డ, విజయవాడరూరల్‌కు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు వారి పరిధిలోని గ్రామాల్లో ఉన్న తాగునీటి సమస్య, తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు వివరించారు. దీనికి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బదులిస్తూ ఈ వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. జిల్లాలోని 343 గ్రామాలను తాగునీటి సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని వెల్లడించారు. రూ. 3.10 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించారు.

పనుల్లో వేగం పెంచాలి...

ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ నాడు – నేడు పథకంలో భాగంగా పాఠశాలల అభివృద్ధి పనులు వేగంగా చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ, ఎంఈవోలు శ్రద్ధ వహించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎన్ఎస్‌పీ కాలువ పరిధిలోని ప్రజాప్రతినిధులతో త్వరలో ఏలూరులో సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు సక్రమంగా నిర్వహించటం హర్షణీయమని చెప్పారు. రైస్‌మిల్లుల కెపాసిటీకి మించి ధాన్యం ఇచ్చే పద్ధతికి స్వస్తి పలకాలని సూచించారు. గరికపర్రు పీహెచ్‌సీ మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినా డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి సమగ్ర సమాచారం లేకుండా మాట్లాడటం శోచనీయమన్నారు. జగనన్న కాలనీలో మెరక పనులు పూర్తి చేసి గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీ...

నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ విజయవాడలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు పేదలను దోచుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం అమల్లో ఉన్నా లేదంటూ రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేలను పిలిస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవచ్చని ఆయన చెప్పారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఉన్న భూమిని జిల్లా పరిషత్ పాఠశాలకు, పాఠశాల భూమిని ఆలయానికి బదలాయిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని కోరారు. అవనిగడ్డలోని గాంధీ క్షేత్రానికి 99 సంవత్సరాల లీజు పేరుతో ఎకరం భూమి తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో టీడీపీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. జిల్లా పరిషత్‌కు చెందిన ఈ స్థల లీజును రద్దు చేసి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

పోలీస్ కమిషనరేట్‌కు టెక్నాలజీ ఎక్స్‌లెన్స్ అవార్డు

కొచ్చిలో జరిగిన సభలో అవార్డు అందుకున్న డీసీపీ ప్రశాంతి



ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్న డీసీపీ మేరీ ప్రశాంతి

విజయవాడ స్పోర్ట్స్: ప్రతిష్టాత్మక సాంకేతిక ప్రతిభ పురస్కారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌ను వరించింది. అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ నేరాలను ఛేదించి, నిందితులను అదుపులోకి తీసుకున్నందుకు గానూ 'యునైటెడ్ కమ్యూనికేషన్' విభాగంలో ఎక్స్‌లెన్స్ కంప్యూటర్స్ సంస్థ జిల్లా పోలీస్ కమిషనరేట్‌ను ఈ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేసింది. కేరళలోని కొచ్చిలో జరిగిన టెక్నాలజీ జాతీయ సెమినార్‌లో డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) మేరీ ప్రశాంతి ఈ అవార్డును అందుకున్నారు. జిల్లాలోని సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసిన విషయం తెలిసిందే. ఫలితంగా పలు ప్రాంతాల్లో నేరాలు జరిగిన తీరును వెంటనే గుర్తించి, ఆధారాలను సేకరించి, కేసులు నమోదు చేస్తున్నారు. నగరంతో పాటు, నగరానికి అనుసంధానంగా ఉన్న జాతీయ రహదారుల్లో స్తంభించిన ట్రాఫిక్‌ను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవడం, దసరా, భవానీదీక్షల విరమణ, వినాయక చవితి, గుణదల మేరీ మాత ఉత్సవాలు, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలు, పలు ప్రభుత్వ కార్యక్రమాలు, వీవీఐపీ, వీఐపీలు పర్యటనల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నపుడు అత్యవసర వాహనాలకు వెంటనే దారి ఇచ్చేలా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తూ ముందస్తు భద్రత చర్యలు తీసుకుంటున్నారు. అసాంఘిక శక్తుల కదలికలను సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూం సిబ్బంది పసిగట్టి సమాచారాన్ని పోలీసు ఉన్నతాధికారులకు వెంటనే చేరవేయడంతో జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. డ్రోన్, బాడీ బాడీ వార్న్ కెమెరాలను వినియోగించి అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా పెట్టారు. ప్రతిష్టాత్మకమైన అవార్డు కమిషనరేట్‌కు రావడం జిల్లాకు గర్వకారణమని కమిషనర్ టీకే రాణా తెలిపారు.

తాడేపల్లిలో నేడు ఈత పోటీలు

తాడేపల్లిరూరల్: ఆక్వాడెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ మందపాటి లక్ష్మీ నరసరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 సంవత్సరాలుగా ఆక్వాడెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈతల పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అసోసియేషన్ లైఫ్ చైర్మన్ గోకరాజు గంగరాజు పర్యవేక్షణలో ఉదయం 6 గంటలకు దుర్గా ఘాట్ నుంచి కృష్ణానది దక్షిణం వైపు లోటస్ ఫుడ్ సిటీ వరకు 1.5 కి.మీ. పొడవున పోటీలుంటాయని చెప్పారు. పాల్గొనే వారిని ఐదు గ్రూపులుగా విభించామన్నారు.

యువకుడికి దేహశుద్ధి

గన్నవరం: ఓ యువతి వివాహాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నించిన యువకుడికి ఆమె కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేసిన ఘటన గన్నవరంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బీబీగూడెం గ్రామానికి చెందిన ఈడ్పుగంటి రాంబాబు కొంతకాలంగా ఓ యువతి వెంటపడి వేధిస్తున్నాడు. ఆ యువతికి వేరే యువకుడితో ఈ నెల ఈ 22న పెళ్లి జరగాల్సి ఉండగా, ఆ రోజు ఉదయం పెళ్లి కుమారుడి ఇంటికి వెళ్లిన రాంబాబు ఆ యువతి, తాను ప్రేమించుకుంటున్నామని చెప్పడంతో వివాహం రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో శనివారం గన్నవరం పంచాయతీ కార్యాలయానికి వచ్చిన రాంబాబును యువతి కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేశారు.

అటవీ సంరక్షణ నియమాలతో పర్యావరణ విధ్వంసం

న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్యా



సదస్సులో మాట్లాడుతున్న టాన్యా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అటవీ సంరక్షణ నియమాలు– 2022 వల్ల పర్యావరణ విధ్వంసంతో పాటు ఆదివాసీల జీవన మనుగడ ప్రమాదంలో పడుతుందని, వాటిని వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు పి.టాన్యా పిలుపునిచ్చారు. అటవీ సంరక్షణ నియమాలకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో శనివారం సీపీఐ(ఎం ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'అటవీ సంరక్షణ నియమాలు - 2022' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నగర కార్యదర్శి ఎం.రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సదస్సులో పాల్గొన్న పి.టాన్యా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఈ దేశ ఖనిజ వనరులను బహుళ జాతి సంస్థలకు, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు అటవీ సంరక్షణ నియమాలు – 2022 తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ నియమాలు అమల్లోకి వస్తే 8 కోట్ల మంది ఆదివాసీలు నిర్వాసితులై సర్వం కోల్పోతారని తెలిపారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మేకల ప్రసాద్, ప్రకాష్, పీఓ డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆర్.భీమశంకర్, ఇఫ్టూ నగర అధ్యక్షుడు ఆర్.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కానూరులో వృద్ధురాలి హత్య

- రూ.4 లక్షల బంగారు ఆభరణాల చోరీ
- కేర్‌టేకర్‌పైనే అనుమానం
- సీసీ కెమెరా మాయం



హత్యకు గురైన చాగంటిపాటి సుమతీదేవి

పెనమలూరు: కానూరులో ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. హత్య జరిగిన ఇంట్లో సీసీ కెమెరా అదృశ్యం అవటం, బంగారు ఆభరణాలు చోరీ జరగటంతో హత్య మిస్టరీగా మారింది. పెనమలూరు సీఐ గోవిందరాజు, మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. కానూరు చలసానినగర్ రెండవ లైన్‌లో చాగంటిపాటి సుమతీదేవి (81) ఒంటరిగా ఉంటోంది. సుమతీదేవిని చూసుకోవడానికి ఆమె కుటుంబ సభ్యులు నాలుగు నెలల క్రితం ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నందిగామకు చెందిన కేర్‌టేకర్ చింతల మల్లేశ్వరిని నియమించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం సుమతీదేవి అల్లుడు పెద ప్రోలు శివశంకర్ రావు ఇంటికి వచ్చి తలుపు కొట్టగా, ఎవరూ తలుపు తీయకపోవటంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులను పిలిచి కిటికీ నుంచి చూస్తే హాల్‌లో సుమతీదేవి, కేర్‌టేకర్ మల్లేశ్వరి నేలపై పడి ఉన్నారు. కిచెన్ వైపు తలుపు తెరచి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి మల్లేశ్వరిపై నీరు చల్లగా ఆమె లేచింది. అయితే సుమతీదేవి మాత్రం మరణించి ఉంది. పోలీసులు కేర్‌టేకర్ మల్లేశ్వరిని ప్రశ్నించగా శనివారం అర్ధరాత్రి తాను ఇంటి బయట ఉన్న బాత్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో ఇద్దరు దుండగులు వచ్చి తనను ఇంట్లోకి తీసుకువెళ్లి దాడి చేయటంతో స్పృహ కోల్పోయానని తెలిపింది. ఆ తరువాత ఏం జరిగిందో తనకు తెలియదని తెలిపింది.

కేర్‌టేకర్ పైనే అనుమానాలు?

సుమతీదేవి అల్లుడు శివశంకర్‌రావు కేర్‌టేకర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరా శుక్రవారం సాయంత్రం నుంచే పని చేయలేదని, సీసీ కెమెరా సైతం మాయమైందని పోలీసుల దృష్టికి తీసుకు వచ్చారు. ఇంటి బయట ఉన్న సీసీ కెమెరాలో బయట వ్యక్తులు ఎవరూ వచ్చినట్లు రికార్డు కాలేదని, ఇంట్లో రూ.4 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాల చోరీ జరగటంతో కేర్‌టేకర్‌పై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు జాగిలాలు, క్లూస్ టీంలను రంగంలోకి దించి పరిశీలించారు.

ప్రియుడితో కలసి భర్తను హత్య చేసిన భార్య

వివాహేతర సంబంధం నేపథ్యంలో కంచికచర్లలో దారుణం



హత్యకు గురైన కుంచం రామారావు (ఫైల్)



భార్య భార్గవి



ప్రియుడు ప్రవీణ్ కుమార్

కంచికచర్ల: కంచికచర్లలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన హత్య పట్టణంలో కలకలం రేపింది. నందిగామ రూరల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ కథనం మేరకు వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన కుంచం రామారావు(47) తన భార్య పిల్లలతో కంచికచర్ల పెద్ద బజారులోని పోస్టాఫీసు రోడ్డులో అద్దెకుంటున్నాడు. రామారావు స్వగ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య భార్గవి కంచికచర్ల మండలం మోగులూరు గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తుంది. వారికి సంతానం లేకపోవటంతో పదేళ్ల క్రితం రామారావు తమ్ముడు శ్రీను చిన్న కుమార్తె జోహారికను పెంచుకుంటున్నారు. ఐదేళ్ల తర్వాత భార్గవికి సుస్మిత అనే పాప పుట్టింది. రామారావు గతంలో జేసీబీ ఉండేది. దానిపై జుజ్జూరు గ్రామానికి చెందిన మోగులూరు ప్రవీణ్‌కుమార్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఆ సమయంలోనే డ్రైవర్ ప్రవీణ్‌కుమార్ తన యజమాని రామారావు భార్య భార్గవితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అప్పటినుంచి ప్రవీణ్‌కుమార్ తరచుగా రామారావు ఇంటికి వస్తుండేవాడు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం అర్ధరాత్రి ప్రవీణ్ రామారావు ఇంటికి రాగా రామారావు అతడిని మందలించాడు. దీంతో రామారావు భార్య భార్గవి, ఆమె ప్రియుడు ప్రవీణ్, అతని స్నేహితులు మోగులూరు బుజ్జిబాబు, పులి సురేష్ కలసి రామారావుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. విషయం గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనానికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని వైద్యం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 3.35 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. సీఐ నాగేంద్రకుమార్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రామారావు సోదరుడు కుంచం శ్రీను ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు

ఏర్పాట్లు పూర్తి



రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర స్థాయి మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలు జగ్గయ్యపేటలోని ఎస్‌జీఎస్ కళాశాలలో ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు దాదాపుగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. కళాశాల గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ తదితర నేతలు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సోదరుడైన సామినేని వెంకట మల్లికార్జున ప్రసాద్ (ఎస్‌వీఎం ప్రసాద్) మెమోరియల్ పేరుతో జరిగే ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి ప్రముఖ జట్లు రానున్నాయని తెలిపారు. ఈ పోటీలను ఈనెల 27 వ తేదీన రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత ప్రారంభిస్తారని, చివరి రోజు మార్చి 1 న బహుమతి ప్రదానోత్సవానికి రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా రానున్నారని తెలిపారు. విజేతలకు వరుసగా రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.25 వేల చొప్పున బహుమతులు అందజేస్తామని, పెద్ద సంఖ్యలో వచ్చే క్రీడాభిమానుల కోసం గ్యాలరీలు తదితర సౌకర్యాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు పూసాల పుల్లారావు, ఆకుల నాని, శేషం ప్రసాద్, చిరంజీవి, సీఐ నాగమురళి, ఎస్ఐ రామారావు పాల్గొన్నారు.

వివాహితపై భర్త, అత్త హత్యాయత్నం

గణపవరం(మైలవరం): వివాహితపై భర్త, అత్త హత్యాయత్నం చేసిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని గణపవరం గ్రామంలో జరిగింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం గణపవరం గ్రామంలో నివాసముంటున్న గుంజ మాధవి(25)పై ఆమె భర్త గుంజ శ్రీను, అత్త సులోచన కలిసి గత రాత్రి కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేసి గాయపర్చారు. మాధవి నిద్రిస్తున్న సమయంలో భర్త, అత్త కలిసి హత మార్చే ప్రయత్నం చేయగా మాధవి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు గమనించి వారిని అడ్డుకున్నారు. తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో పడివున్న బాధితురాలిని ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త శ్రీను మైలవరం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. వీరికి ఇద్దరు మగ సంతానం. గత కొంతకాలంగా భార్యభర్తల మధ్య కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ సంఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు.

లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పటమట ఎస్ఐ పద్మ

ఆటోనగర్(విజయవాడతూర్పు): లారీ ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పటమట ఎస్ఐ పద్మ తెవివరాల మేరకు.. బ్లూ రంగు షర్ట్, నల్లప్యాంట్ ధరించుకున్న గుర్తుతెలియని వ్యక్తి మద్యం సేవించి ఆటోనగర్‌లోని పంటకాలువ రోడ్డు వాటర్ సర్వీసింగ్ షాపు పక్కన నిద్రపోతున్నాడు. ఇదే సమయంలో పంటకాలువ వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ ఆ వ్యక్తిని గమనించలేదు. అతనిని ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై మృతిచెందాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని సీసీ ఫుటేజ్ ద్వారా స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ ప్రకాష్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.